నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 ఆదివారం 19 జనవరి 2025
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



గోదావరిలో ఇసుక తవ్విన ప్రదేశాన్ని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

# మంచిర్యాలలో యంత్రాంగం ఉన్నట్టా.. లేనట్టా?

**గోదావరి నుంచి ఇసుక, మట్టి తరలించుకుపోతున్నా పట్టించుకోరా?**

- ఎమ్మెల్యే పీఎస్సార్ కనుసన్నల్లోనే ఈ తతంగం
- డబ్బంతా ఆయన జేబులోకే వెళ్తున్నది
- ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- స్థానిక నాయకులతో కలిసి గోదావరి పరిశీలన

మంచిర్యాలటౌన్, జనవరి 18 : 'పట్టణాన్ని ఆనుకొని ఉన్న గోదావరి నుంచి ఈ 20 రోజుల్లో 800 లారీలకుపైగా ఇసుక, మట్టిని తరలించుకుపోయారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇసుక తోడుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. అసలు మంచిర్యాలలో ప్రభుత్వ యంత్రాంగం ఉన్నట్టా.. లేనట్టా..? ఈ తతంగమంతా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కనుసన్నల్లోనే జరుగుతుంది. ఇసుక, మట్టి తరలింపు ద్వారా వచ్చిన డబ్బంతా ఆయన జేబులోకి వెళ్తున్నది.'' అంటూ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక గోదావరి తీరాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. 12 అడుగులకు పైగా లోతుకు తవ్వగా, ఆ గుంతలను మీడియాకు చూపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. మంచిర్యాల వద్ద పవిత్ర గోదావరి నదీ తీరాన సమ్మక్క, సారలమ్మ గద్దెలు కొలువై ఉన్నాయని, జాతర సమయంలో లక్షలాది మంది భక్తులు గుడారాలు వేసుకుని ఉంటారని, అలాగే శివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. గోదావరిలో 20 రోజులుగా జేసీబీతో నిత్యం పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపడుతున్నా యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ఇసుక మాఫియా, మట్టి మాఫియాను ప్రోత్సహిస్తున్నదంటూ ప్రజలంతా మాట్లాడుకుంటున్నారని, అది ఇక్కడ ప్రత్యక్షంగా కనిపిస్తున్నదన్నారు. ఇక్కడ తవ్విన ఇసుక, మట్టి ఎక్కడికి పోతున్నదని, జిల్లా అధికారులు, మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకే 800 పైబడి లారీల్లో ఇసుక, మట్టిని తరలించారని, తప్పు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడైనా సొంత అవసరాలకోసం ఇసుక, మట్టి తీస్తే జరిమానాలు, కేసులు పెట్టే రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు ఇంత పెద్ద తతంగం జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, గోగుల రవీందర్‌రెడ్డి, అక్కూరి సుబ్బయ్య, ఎడ్ల శంకర్, తోట తిరుపతి, పడాల రవీందర్, షఫియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక తవ్వేందుకు ఉపయోగిస్తున్న జేసీబీ

## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 18 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లింగాపూర్ మండలానికి చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాన్ని చూసి ఆ పార్టీని నాయకులు వీడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# డంప్‌యార్డు తరలింపు లేనట్లేనా!?



ఆండాలమ్మ కాలనీలోని డంప్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

**మూడు నెలల్లోనే సమస్య పరిష్కరిస్తామని ఎన్‌జీటీకి నివేదిక**

- తొమ్మిది నెలలు గడిచినా పట్టింపు కరువు
- బయో మైనింగ్ చేస్తున్నాం.. తరలించడం కుదరదంటున్న అధికారులు
- దట్టమైన పొగతో రోగాలస్తున్నాయంటూ స్థానికుల ఆవేదన
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని వేడుకోలు

### సాధ్యమైనంత త్వరగా తరలించాలి



ఎన్నో ఏండ్లుగా ఈ డంప్ యార్డు కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కరోజుని కాదు. రోజూ పొగ వస్తనే ఉంటది. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. వ్యాధులు వస్తున్నాయి. అధికారులు సాధ్యమైనంత త్వరగా ఈ డంప్ యార్డును వేరూ చోటికి తరలించాలి.

- చిన్నాల లక్ష్మి, ఆండాలమ్మ కాలనీ

### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



డంప్ యార్డును ఇక్కడి నుంచి మూడు నెలల్లో తరలిస్తామని చెప్పి ఏడాది కావస్తున్నది. మేం పేదోళ్లం. ఇక్కడ తప్ప ఇంకోదగ్గరికి వెళ్లి బతకలేం. ఈ విషయం మంచిర్యాలలో ఎవరైనా చెబుతారు. అనారోగ్య సమస్య వస్తే ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లే స్థోమత కూడా మాకు లేదు. ఇంతకన్నా ఏం చెప్పలేం. అధికారులు ఇచ్చిన మాటకు కట్టుబడి ఇక్కడి నుంచి డంప్ యార్డు తరలించాలి.

- పచ్చ స్వప్న రాణి, ఆండాలమ్మ కాలనీ

మంచిర్యాల, జనవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలోని ఆండాలమ్మ కాలనీలోగల డంప్‌యార్డు సమస్య పరిష్కారమయ్యేలా లేదు. మూడు నెలల్లో ఇక్కడి నుంచి తరలిస్తామంటూ ఎన్‌జీటీకి నివేదిక ఇచ్చిన అధికారులు తొమ్మిది నెలలైనా పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. దట్టమైన పొగతో అనారోగ్యం పాలవుతున్నామని, ఇచ్చిన మాట ప్రకారం డంప్‌యార్డును వేరేచోటికి మార్చాలని స్థానిక ప్రజానీకం వేడుకుంటున్నది.

### రిపోర్టు ఇచ్చినా కదలని ప్రక్రియ

ఆండాలమ్మ కాలనీలోని డంప్ యార్డును నగరానికి దూరంగా తరలించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఇక్కడి వ్యర్థాలను కాల్చినప్పుడు వెలువడే దట్టమైన పొగ, కార్బన ఉద్గారాలతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని, ఇక్కడి నుంచి డంప్‌యార్డును తరలించాలని స్థానికులు ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో గతేడాది జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కలెక్టర్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారితో జాయింట్ కమిటీ ఏర్పాటు చేశారు. డంప్‌యార్డు పరిశీలించిన కమిటీ ఇక్కడి పరిస్థితులపై రిపోర్ట్‌ను సబ్‌మిట్ చేసింది. మూడు నెలల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని గతేడాది ఏప్రిల్‌లో నివేదిక ఇచ్చింది. కానీ, తొమ్మిది నెలలు గడుస్తున్నా డంప్‌యార్డు తరలింపు ప్రక్రియ ముందుకు కదల్లేదు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమేగాక ఎన్‌జీటీని తప్పుదోవ పట్టించేలా అధికారులు నివేదిక ఇచ్చారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

### ఎన్‌జీటీకి ఇచ్చిన నివేదికలో ఏముందంటే..

- 2000 సంవత్సరం నుంచి వార్డు నంబర్-9లో ఉన్న ఆండాలమ్మ కాలనీలోగల రెండెకరాల్లో వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజూ 45 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. అయితే ఈ వ్యర్థాలను ఇక్కడ డంప్ చేయకుండా హాజీపూర్ మండలం పోచంపాడులోని 4 ఎకరాల్లోకి తరలించాలనుకున్నారు. కానీ స్థానికులు వ్యతిరేకించడంతో అది సాధ్యం కాక.. ప్రస్తుతమున్న స్థలంలోనే డంప్‌యార్డును కొనసాగిస్తున్నారు.
- ఆండాలమ్మ కాలనీలోని డంప్‌యార్డును సందర్శించినప్పుటు అక్కడ ఎలాంటి మంటలు, పొగను గుర్తించలేదు. ఈ యార్డులో వర్కింగ్ కండీషన్‌లో ఉన్న బోర్‌వెల్ ఉంది. ప్రమాదవశాత్తు మంటలు ఏర్పడితే ఆర్పేందుకు అది ఉపయోగపడుతుంది. దీనికి తోడుగా ప్రతి రోజూ రెండు వాటర్ ట్యాంకర్లు అక్కడ ఉంటున్నాయి.
- స్థానికంగా నివాసం ఉండే వారిలో కొందరు దుర్మార్గులు అశాంతి కలిగించాలనే ఉద్దేశంతో డంప్‌కు నిప్పు పెడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు 24 గంటల పాటు వాచ్‌మెన్‌లు షిఫ్టుల వారీగా డంప్ యార్డు దగ్గర పని చేస్తున్నారు. వారి దగ్గర స్థానిక ఫైర్ స్టేషన్ ఫోన్ నంబర్ ఉంది. ఎప్పుడు మంటలు చెలరేగినా వారు ఫైర్ స్టేషన్‌ను సంప్రదిస్తారు.
- డంప్ యార్డులో చెత్తను బయో మైనింగ్ చేసేందుకు తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చర్యలు చేపట్టింది. టైమ్ బాండ్ పెట్టుకొని 2024 సెప్టెంబర్ నెలలోగా బయోమైనింగ్ పూర్తి చేస్తాం. ఈ మేరకు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించాం.
- స్థానికుల నుంచి వస్తున్న వ్యతిరేకత దృష్ట్యా రానున్న మూడు నెలల్లో వేరే ప్రాంతానికి డంప్‌యార్డు తరలించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డిస్పోజల్ చేపడుతాం. ఎండాకాలం ఫైర్ యాక్సిడెంట్స్ ఎక్కువగా జరిగే అవకాశమున్నందుకు అదనపు ఫైరింజన్ వాహనాలను సమకూరుస్తాం. మరో చోట డంప్ యార్డు ఏర్పాటు చేయడానికి కొంత సమయం పట్టే అవకాశమున్నందున, అప్పటి వరకు స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

### నివేదికలో పేర్కొన్నవన్నీ అవాస్తవాలే...

త్రీమెన్ కమిటీ ఎన్‌జీటీకి ఇచ్చిన నివేదికలో పేర్కొన్న అంశాలన్నీ అవాస్తవాలని స్థానికులు మండిపడుతున్నారు. డంప్‌యార్డు దగ్గర పగలు మాత్రమే సెక్యూరిటీ సిబ్బంది ఉంటున్నదని, రాత్రివేళ ఎవరూ ఉండడం లేదని వారు చెబుతున్నారు. బయో మైనింగ్‌లో మిగిలిపోయిన చెత్తకు రాత్రివేళ నిప్పు పెడుతున్నారని, దీంతో భరించలేని దుర్వాసనతో పాటు పొగ వస్తుందని వాపోతున్నారు. రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కాల్చి పోతున్నారని చెబుతున్న అధికారులు వారిని పట్టుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. డంప్‌కు మంటలు అంటుకున్నప్పుడు వాటిని ఆర్పేందుకు వాటర్ ట్యాంకర్లు పెట్టినట్లు చెప్పింది అవాస్తవమే అంటున్నారు. మంటలు అంటుకున్నప్పుడు మాత్రమే ఆ ట్యాంకర్లు వచ్చి చల్లారుస్తున్నాయి తప్పితే అక్కడే అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. గడిచిన పదిరోజులుగా నిత్యం పొగలు వస్తూనే ఉన్నాయి అంటున్నారు. ఒక్కసారి నిప్పు పెట్టి పోతే రోజుల తరబడి పొగలోనే బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. మొన్నటి వరకు డంప్‌యార్డును తరలిస్తామని చెప్పిన అధికారులు కొన్ని రోజులుగా బయో మైనింగ్ చేస్తున్నాం.. ఇక ఎక్కడికి తరలించేది లేదని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌జీటీకి ఇచ్చిన నివేదికను అనుసరించి డంప్‌యార్డును సాధ్యమైనంత త్వరగా ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో పని చేసిన కలెక్టర్ డంప్‌యార్డును ముందు పోచంపాడుకు తరలిస్తామని చెప్పారని, అక్కడ కుదరకపోవడంతో నస్పూర్ పరిధిలోని తాటిపల్లి గ్రామంలోని 20 ఎకరాల్లోకి తరలిస్తామని చెప్పారని గుర్తు చేశారు. స్థానికులకు ఎదురవుతున్న ఇబ్బందులు, అనారోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు డంప్‌యార్డును తరలించేందుకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

## మంచిర్యాల కార్పొరేషన్

**రెండు మున్సిపాలిటీలు, ఎనిమిది జీపీలను విలీనం చేస్తూ గెజిట్**



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

మంచిర్యాలటౌన్, జనవరి 18: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించి కీలక అడుగు పడింది. రెండు మున్సిపాలిటీలు, ఎనిమిది గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసేందుకు కేబినెట్, అసెంబ్లీలలో చేసిన తీరాన్మాలకు రాజముద్ర (గెజిట్)పడింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంతో పాటు తాజాగా జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంచిర్యాలను కార్పొరేషన్‌గా చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఈ నిర్ణయాలను గవర్నర్ ఆమోదం కోసం పంపగా, ఆయన గెజిట్ విడుదల చేశారు. కార్పొరేషన్ ఏర్పాటుకు మంచిర్యాల, నస్పూరు మున్సిపాలిటీలతో పాటు హాజీపూర్ మండలంలోని పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామపంచాయతీలను విలీనం చేయాలని నిర్ణయించారు. అయితే కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాల జీవో రావాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు.



జిల్లపల్లి విఘ్నేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకోం

బెల్లంపల్లి, జనవరి 18 : బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హెచ్చరించారు. ఇటీవల జరిగిన దాడిలో గాయపడి బెల్లంపల్లి వంద పడకల దవాఖానలో చికిత్స పొందుతున్న కన్నెపల్లి మండలం వీగాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు జిల్లపల్లి విఘ్నేష్‌ను శనివారం ఆయన పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసానిచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలతో దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. దాడులు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు కూడా వారికే వంతపాడుతూ దాడులను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని స్పష్టం చేశారు. ఏడాది పాలనలో బెల్లంపల్లిలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకే రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్నారని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని, ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు అమలు కాకపోవడంతో ప్రజలు కేసీఆర్‌ను తలుచుకుంటున్నారని గుర్తు చేశారు. మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# అందాల కనువిందు

**పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ ఫారెస్టుల్లో బర్డ్‌వాక్ ఫెస్టివల్ ప్రారంభం**

- తరలివచ్చిన పక్షి ప్రేమికులు
- కెమెరాల్లో చిత్రీకరిస్తూ సందడి
- పాల్గొన్న ఏఎస్పీ చిత్తరంజన్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



సందడి చేస్తున్న బ్రాహ్మణి డక్స్



స్ట్రాబెర్రీ ఫించ్ బర్డ్

*కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ రేంజ్ పరిధితో పాటు కాగజ్‌నగర్ మండలం కోసిని డ్యామ్ వద్ద శనివారం మూడో బర్డ్‌వాక్ ఫెస్టివల్ నిర్వహించగా, పక్షి ప్రేమికులు తరలివచ్చారు. పెంచికల్‌పేట్ మండలంలోని బొక్కి వాగు, ఉచ్చ మల్లివాగు, నందిగాం పాలరాపు గుట్ట, గుండె పల్లి బేస్ క్యాంప్, కొండెంగలొద్ది, బోలుమెత్తం తదితర ప్రాంతాలను సందర్శించి అరుదైన పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. ఇక కోసిని డ్యామ్ వద్ద పక్షులతో పాటు ప్రకృతి అందాలను తిలకించేందుకు దాదాపు 35 మంది ప్రకృతి ప్రేమికులు వచ్చారు. ఆయాచోట్ల ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్ దేవ్ బోబడే, ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నం బర్డ్‌వాక్ ఫెస్టివల్ ముగుస్తుందని అధికారులు తెలిపారు. కాగా, గతంలో కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో 248 రకాల పక్షులను గుర్తించగా.. తాజాగా మరో 35 రకాల పక్షి జాతులను గుర్తించారు.*

*- కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/పెంచికల్ పేట్/కాగజ్‌నగర్, జనవరి 18*



ఫాల్కన్ బర్డ్



ఇండియన్ పారడైజ్ ఫ్లై క్యాచర్



బర్డ్‌వాక్‌లో పాల్గొన్న అధికారులు, పక్షి ప్రేమికులు



బొక్కి వాగు వద్ద పక్షులను కెమెరాలో బంధిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



ఫ్లయింగ్ ఫాక్స్ (గబ్బిలం)